క్లుప్తంగా

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారికి అర్చకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని లయన్స్ క్లబ్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దే శేషగిరిరావుతోపాటు అధిక సంఖ్యలో భక్తులు సందర్శించి పూజలు చేశారు. దేవస్థానం మాజీ పాలకమండలి చైర్మన్ సుంకర కృష్ణ, మిరియాల వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షులు గాజుల రామారావు, యర్రంశెట్టి శివరామకృష్ణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

6న హుండీ లెక్కింపు..

శ్రీదాసాంజనేయస్వామివారి ఆలయ హుండీని బుధవారం లెక్కించనున్నట్లు ఈవో పి.లోకేశ్వరి తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తిగల భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరుకావాలని ఈవో కోరారు.

పింఛన్లు పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): పింఛన్ల సొమ్మును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని 64వ డివిజన కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ సూచించారు. డివిజన్‌లోని కండ్రిక కాలనీ, బర్మాకాలనీ, రాధానగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు సచివాలయాల సిబ్బందితో వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యరగొర్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సుమన్‌ను కలిసిన ఐక్యవేదిక అధ్యక్షుడు



మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ బీసీ ఐక్యవేదిక ప్రమాణ స్వీకారోత్సవానికి సినీనటుడు సుమన్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించినట్లు ఐక్యవేదిక అధ్యక్షులు పీవీఎల్ ఎన్‌రాజు తెలిపారు. హైదరాబాద్‌లోని సుమన్ నివాసంలో గురువారం ఆయనను కలిసి ఆహ్వానం అందించినట్లు వివరించారు. ప్రమాణస్వీకారోత్సవానికి హాజరవుతానని సుమన్ తెలిపినట్లు రాజు తెలిపారు.

ఘనంగా దీపావళి వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్: నగర ప్రజలు గురువారం దీపావళి వేడుకలను సంతోషంగా జరుపుకున్నారు. స్థానిక మధురానగర్, ముత్యాలంపాడు, రామకృష్ణాపురం, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, అయోధ్యనగర్, దుర్గాపురం, మాచవరం తదితర ప్రాంతాల్లో దీపావళి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఇంటి ముందు రంగవళ్ళులు తీర్చిదిద్దారు. తొలుత లక్ష్మీపూజలు చేసి అనంతరం బాణాసంచా కాల్చారు. వీధులన్నీ బాణాసంచా మోతతో దద్దరిల్లాయి. రోడ్లమీదే బాణాసంచా కాల్చడంతో వాహనచోదకులు కొంతమేర ఇబ్బంది పడ్డారు.

చిన్నారుల దీపావళి సందడి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణా సంస్థ కార్యాలయంలో శుక్రవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్ టీ కృష్ణకుమారి దీపావళి పండుగ విశిష్టతను వివరించారు. ప్రత్యేకావసరాలుగల చిన్నారులకు మన సంస్కృతి సంప్రదాయాలను తెలియచేసేందుకు దీపావళి వేడుకలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.



కళ్లల్లో ఇంకా కల్లోల కన్నీరు



బుడమేరు వరద నీటిలో ప్రజల అవస్థలు(ఫైల్)

- బుడమేరు వరద బాధితులపై కనికరం చూపని సర్కారు
- బాధితులకు పూర్తిస్థాయిలో అందని సాయం
- ప్రభుత్వం అన్యాయం చేసిందని బాధితుల ఆవేదన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపు సంఘటన చోటుచేసుకుని సరిగ్గా రెండునెలలు గడిచింది. సెప్టెంబర్ ఒకటో తేదీన సంభవించిన వరదలకు సర్వసం కోల్పోయిన ఈప్రాంత ప్రజలు.. ఒకటో తారీఖు వస్తుందటనే రెండునెలల కిందటి ముంపు సంఘటనను గుర్తుచేసుకుంటూ అమ్మో ఒకటోతారీఖా అంటూ బెంబేలెత్తిపోతున్నారు. కళ్లముందు జరిగిన వరద కల్లోలం మిగిల్చిన కన్నీరు ఇంకా వారి కళ్లల్లోనే ఉంది. ప్రతి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్న సీఎం చంద్రబాబు హామీ సైతం ప్రకటనలకే పరిమితం కావడంతో తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వసాయం కోసం ఇంకా వందలాది మంది బాధిదులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నీటమూటగానే చంద్రబాబు మాట..

వరద ముంపులో ఉన్న తమను పరామర్శించడానికి వచ్చిన సీఎం చంద్రబాబు నేనున్నానని.. ఏఒక్క వరద బాధితుడికి అన్యాయం జరగదని..ప్రతి ఒక్కరికి వరద సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే వరదలు సంభవించి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ బాధితులందరికీ వరద సాయం అందలేదు. అదేమని అడిగితే మ్యాపింగ్ చూపించడం లేదని.. అసలు మీరు, మీ ఇల్లు ఇక్కడ లేనేలేదంటూ ప్రభుత్వాధికారులు మాట దాటేస్తున్నారే తప్ప తమ బాధలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. తమ ఓట్ల కోసం ఇంటింటికి తిరిగి ఓట్లేయించుకున్న స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు కూడా తమకు న్యాయం చేయడం లేదని కన్నీరుమన్నీరవుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

బాధితులను విస్మరించిన ప్రభుత్వం..



తహశీల్దార్ ఆఫీసు వద్ద దరఖాస్తులు సమర్పించేందుకు అవస్థలు పడుతున్న వరద బాధితులు(ఫైల్)

బుడమేరు కాలువకు ఆనుకొని ఉన్న నగరశివారు ప్రాంతాలైన ఇందిరానాయక్‌నగర్, సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, శాంతినగర్, ప్రకాష్‌నగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, ఉడా కాలనీ, కండ్రిక, రామకృష్ణాపురం పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఈ వరద ప్రభావం కారణంగా తీవ్రంగా నష్టపోయారు. కొందరు తమ కుటుంబసభ్యుల ప్రాణాలను కోల్పోగా.. మరికొంతమంది తమ సర్వస్వాన్ని కోల్పోయి రోడ్డునపడ్డారు. నాడు మేమున్నామని మాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం బాధితుల ఆక్రందనను ఏమాత్రం పట్టించుకోకుండా గాలికొదిలేసింది. దీంతో వందలాది మంది వరద బాధితులకు సాయం దక్కలేదు.

సాయం అందక ఇబ్బందులు..



నగరంలో వరద ముంపునకు గురైనవాటిలో సగం డివిజన్లు కూడా లేవు. 32 డివిజన్లలోని వరద బాధితులను గుర్తించేందుకు ప్రభుత్వం ఇంతకాలం సాగదీయడం బాధాకరం. ఇది బాధితులకు అన్యాయం చేయడమే తప్ప మరొకటి కాదనిపిస్తుంది. మా ఇంటితోపాటు నాన్న ఆటో, నాబైకు కూడా వరదల్లో పాడైపోయాయి. అన్ని ఆధారాలు చూపిస్తూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

– కృష్ణ, రామకృష్ణాపురం

రెండునెలలుగా తిప్పకుంటున్నారు



మా ఆయన చెప్పుల షాపులో పనిచేస్తుంటాడు. వరదల్లో మా ఇల్లు పూర్తిగా మునిగిపోయింది. పిల్లల పుస్తకాలు కూడా పాడైపోయాయి. ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తు చేసుకుంటే వచ్చిందని చెప్పారు. తీరా బ్యాంకుకు వెళ్తే ఒక్క రూపాయి కూడా పడలేదు. సచివాలయం, కార్పొరేషన్, ఎమ్మార్వో, ఎమ్మెల్యే ఆఫీస్‌ల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు.

– బందా శ్రీవల్లి, సింగ్‌నగర్

నాలుగుసార్లు దరఖాస్తు చేశా..



బుడమేరు వరదలకు బాగా నష్టపోయాం. వరదలు తగ్గాక అధికారులే మా ఇంటికి వచ్చి మా వివరాలన్నీ రాసుకున్నారు. కష్టపడి సంపాదించి, ఒక్కో రూపాయి పోగేసి కొనుకున్న సామాన్లన్నీ పాడైపోయాయి. కానీ మాకు పరిహారం అందలేదు. ఇప్పటికి నాలుగుసార్లు దరఖాస్తు చేశాం. వరద బాధితుల పట్ల ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం దారుణం.

– అబ్దుల్ బాషా, రామకృష్ణాపురం

కాళ్లరిగేలా తిరుగుతున్నాం..



నాభర్త కిడ్నీ పేషంట్..వరదల్లో మాఇల్లు పూర్తిగా మునిగిపోయింది. సామాన్లన్నీ పోయాయి. ప్రభుత్వ సాయం కోసం రెండు నెలలుగా ఎదురు చూస్తూనే ఉన్నాము. మాబండికి మాత్రం రూ.3వేలు డబ్బులు వేశారు. ఇంటికి అందించే పరిహారం రూ.25వేలు వేయలేదు. అదేమంటే మ్యాపింగ్ చూపించడం లేదంటున్నారు. మరి బండికి ఎలా డబ్బులు వేశారో తెలియడం లేదు. అధికారులు, నాయకుల చుట్టూ తిరిగితిరిగి విసిగిపోయాం.

– వేముల భారతి, సుందరయ్యనగర్

శ్రీరాములు త్యాగాన్ని అవమానించిన చంద్రబాబు

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు,



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర అవతరణకు తన ప్రాణాలను బలి చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములను ఆయన త్యాగాన్ని దారుణంగా అవమానించిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు విమర్శించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మునిసిపల్ కార్యాలయం సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద వేడుకలను నిర్వహించారు. పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ, కొణిజేటి రోశయ్య విగ్రహాలకు.. వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారన్నారు. 1956లో ఆంధ్ర రాష్ట్ర అవతరణ జరిగినప్పటి నుంచి నవంబర్ ఒకటో తేదీని ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంగా జరుపుకొంటున్నామని గుర్తుచేశారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోయినప్పుడు విభజిత రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పని చేశారని తన ప్రభుత్వ హయంలో ఐదేళ్లలో ఏ ఒక్క సంవత్సరం కూడా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం జరపలేదన్నారు. జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న సమయంలో అనేక మంది ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం జరపాలని కోరారని గుర్తుచేశారు. ఆయన ముఖ్యమంత్రి అయిన మొదటి సంవత్సరంలోనే నవంబర్ 1వ తేదీన అధికారికంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంగా జరపాలని ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు రాష్ట్రంలో ఘనంగా అవతరణ దినోత్సవ జరిగిందన్నారు. 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని మళ్లీ అవతరణ దినోత్సవాన్ని జరపకుండా మరిచి పోయారన్నారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ అనేక సార్లు చెప్పారన్నారు. వారికి ఇప్పుడెందుకు ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం గుర్తుకులేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణ, ఆర్యవైశ్య నాయకుడు కొనకళ్ల విద్యాధర రావు తదితరులు పాల్గొన్నారు

పొట్టిశ్రీరాములు త్యాగాన్ని మరువలేం



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్, నాయకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినేని అవినాష్ అన్నారు. నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి అమరులయ్యారని కొనియాడారు. రాష్ట్రంలో 2019 నుంచి 2024 వరకూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు ఏమీ చేయడం లేదని విమర్శించారు. పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, తంగిరాల రామిరెడ్డి, వియ్యపు అమర్నాథ్, మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం సదా స్మరణీయం



సభలో మాట్లాడుతున్న వేముల హజరత్తయ్యగుప్తా

విజయవాడ కల్చరల్: పొట్టి శ్రీరాములు త్యాగం సదా స్మరణీయని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు. ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు, గురునాథం, అశోక్‌కుమార్, రామ్మోనరావు, విజయలక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు. సుశీల్‌కుమార్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు పలు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు.

పది పరీక్షల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టాలి


జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి సుబ్బారావు



ఓరియేంటేషన్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ యువి సుబ్బారావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పదోతరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యు.వి సుబ్బారావు అన్నారు. గవర్నర్‌పేటలోని సీవీఆర్ మున్సిపల్ స్కూల్లో ఉపాధ్యాయుల ఓరియంటేషన్ కార్యక్రమం ముగిసింది. నగరంలోని సెంట్రల్, నార్త్, ఈస్ట్, వెస్ట్ మండలాలకు చెందిన 605మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులనుద్దేశించి డీఈఓ యు.వి.సుబ్బారావు మాట్లాడుతూ పదోతరగతి ఉత్తీర్ణత పెంచడానికి ఓరియంటేషన్ కార్యక్రమం దోహదం చేస్తుందని చెప్పారు. సిలబస్, బ్లూ ప్రింట్, మాదిరి ప్రశ్నాపత్రం గురించి వివరించారు. ఎఫ్ఏ–1 మార్కులను ఆన్‌లైన్ చేసి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులో నమోదు చేయాలని సూచించారు. ఈనెల 14నవ తేదీ జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్‌లో అందజేయాలన్నారు. సమావేశం రోజున తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈసీబీ కార్యదర్శి షేక్ ఉమర్ ఆలీ, కోర్సు డైరెక్టర్ బాణోతు వెంకటేశ్వర్లు, సీవీఆర్ హై స్కూల్ ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంటి రాజు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

కార్తిక మాసోత్సవాలకు ఏర్పాట్లు



ముత్యాలంపాడులో పరమేశ్వరుని విగ్రహం

మధురానగర్(విజయవాడసెంట్రల్): శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసోత్సాలకు నగరంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. కార్తీక మాసంలో 365 వత్తులతో దీపాలను వెలిగిస్తే సంవత్సరం అంతా దీపారాధన చేసిన ఫలం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. శివకేశవులకి ప్రీతికరమైన కార్తీకమాసంలో శివుని దర్శించిన, అభిషేకం, అర్చనలు చేసినా ఇహ పర లోకములలో సర్వసౌఖ్యములు పొందుతారని భక్తుల విశ్వాసం. అయోధ్యనగర్‌లోని శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం, ముత్యాలంపాడు శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం, మధురానగర్ శ్రీ ఉభయ రామలింగేశ్వరస్వామి దేవాలయం, రైల్వేకాలనీలోని శ్రీశివకేశవ ఆలయం, దావు బుచ్చయ్యకాలనీలోని శ్రీశ్యామలాంబదేవి దేవాలయంలో కార్తీకమాసోత్సవాలను ఘనంగా నిర్వహించటానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే ఆలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. అలాగే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు.

స్వయంగా అభిషేకం చేసుకునే ఏర్పాట్లు....

ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలోని శ్రీభవాని శంకర మరకత పోలిక శివలింగం, మధురానగర్ శ్రీదత్తసాయి మందిరంలో చంద్రమౌళీశ్వర స్వామికి భక్తులు స్వయంగా అభిషేకం చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఇక్కడ స్వాములు, భవానీ, మాలధారులకు నెలరోజుల పాటు అన్నప్రసాద వితరణ ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపు శారదా కళాసమితి వార్షికోత్సవం

విజయవాడ కల్చరల్: శారదా కళాసమితి 46వ వార్షికోత్సవాన్ని ఆదివారం సాయంత్రం గాంధీనగర్‌లోని ఆలపాటి రామారావు, అనుమల లక్ష్మణరావు ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తునట్లు శారదా కళాసమితి వ్యవస్థాపకుడు జోగిపర్తి శంకర్రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సినీనటుడు సుమన్‌కు రజిత కలశ సమర్పణ నిర్వహిస్తునట్లు తెలిపారు. హోంమంత్రి వంగలపూడి అనిత్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు. గద్దె రామ్మోహన్‌రావు, యలమంచలి సుజనాచౌదరి హాజరుకానున్నట్లు తెలిపారు.

ఇందిరాగాంధీకి ఘననివాళి

విజయవాడ కల్చరల్: మాజీప్రధాని ఇందిరాగాంధీ ఉక్కు మహిళ అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో తెలుగుకళావాహిని పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీకళాభారతి ఆధ్వర్యంలో శుక్రవారం మాజీప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గోళ్ళ నారాయణరావు, బోడి ఆంజనేయరాజు, కె.డేవిడ్ రాజు పాల్గొన్నారు.

న్యాయవాది యద్దనపూడి హేమలతకు డాక్టరేట్



హేమలత

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరానికి చెందిన హైకోర్టు న్యాయవాది యద్దనపూడి హేమలతకు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. హేమలత ఇప్పటికే 18 పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీలు పొందడంతోపాటు నాట్యం, సంగీతం, సంస్కృత భాషలలో ప్రావీణ్యం సాధించారు. ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి నేతృత్వంలో బాలకార్మికుల సమస్యలు, వాటి నివారణ ఉపాయాలు అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది. ఈసందర్భంగా హేమలతను పలువురు న్యాయవాదులు, స్థానిక పెద్దలు అభినందించారు.

మద్యంషాపు ఏర్పాటును నిరసిస్తూ ధర్నా



మద్యంషాపు వద్దంటూ ధర్నా చేస్తున్న ప్రజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నివాసాల మధ్య మద్యంషాపు ఏర్పాటు చేస్తే సహించబోమని ట్రెండ్ సెట్ మెడోస్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, దేవీనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. స్థానిక దేవీనగర్ 8వరోడ్డు ట్రెండ్‌సెట్ మెడోస్ వద్ద మద్యంషాపు ఏర్పాటును నిరసిస్తూ శుక్రవారం వారు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఇక్కడ గంజాయి బ్యాచ్ ఆగడాలతో అల్లాడుతున్నామని ఇప్పుడు మద్యంషాపు ఏర్పాటుతో తమ ప్రాంతానికి రక్షణ కరువవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా అధికారులు ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా శిబిరాన్ని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘురామరాజు సందర్శించారు. సమస్యను ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇక్కడ మద్యంషాపు ఏర్పాటు చేయకుండా చూస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ధర్నాలో సీపీఎం నాయకులు జి.వెంకటేశ్వరరావు, రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని మద్యంషాపు వద్దంటూ నినాదాలు చేశారు.

ఆళ్వార్ దాస్‌కు నివాళి



ఆళ్వార్‌దాస్‌కు నివాళులర్పిస్తున్న షఫీవుల్లా, నాగమల్లిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): నేటి యు వత వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు ఆళ్వార్ దాస్ ఆశయ సాధనకు కృషి చేయాలని వాకర్స్‌క్లబ్ సభ్యురాలు, హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోరంగి నాగమల్లీశ్వరి సూచించారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్‌చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం ఆళ్వార్ దాస్ జయంతి వేడుకలను నిర్వహించారు. సందర్భంగా ఆళ్వార్ దాస్ సేవలను కొనియాడారు. ట్రస్ట్ సెక్రటరీ ఎస్‌కే షఫీవుల్లా మాట్లాడుతూ నడకతో ఆరోగ్యానికి కలిగే మేలును విస్తృతంగా ప్రచారం చేసిన మహోన్నత వ్యక్తి ఆళ్వార్‌దాస్ అని అన్నారు. అనంతరం ఆళ్వార్ దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, వాకర్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.